విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కొల్లురవీంద్రకు మంత్రి పదవితో సంబరాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం శాసన సభ్యులు కొల్లు రవీంద్ర రెండవసారి మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆయన అనుచరులు బందరు పురవీధులలో బాణాసంచా కాల్చుతూ ఊరేగారు. అగ్నికుల క్షత్రియ వర్గానికి చెందిన కొల్లు రవీంద్ర, కీర్తిశేషులు కొల్లు సుబ్బారావు, వెంకటసౌభాగ్యవతి దంపతులకు 20-06-1972 సంవత్సరంలో జన్మించి బిఎ ఎల్ఎల్బి పూర్తిచేసి వంశపారంపర్యంగా వస్తున్న రైస్‌మిల్ మిషనరీ తయారీ రంగంలో సేవలు అందిస్తూ, తన మామ మాజీ మంత్రి దివంగత నడకుదుటి నరసింహారావు రాజకీయ వారసునిగా 2005 లో డివిజన్ అధ్యక్షుడిగా రాజకీయాల్లో ప్రవేశించి, 2006లో బందరుపోర్టు, బందరు నుండి తరలి వెళ్ళిపోతున్న తరుణంలో పోర్టు ఉద్యమ నిర్మాణం, ముందుండి నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కీలక సమయంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని పోర్టును బందర్ గౌడ్ తిరిగి తీసుకురావడంలో సఫలమయ్యారు. 2009వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి పేర్ని నాని చేతిలో ఓటమి పాలై, 2014లో అదే నానిని ఓడించి ఎమ్మెల్యేగా ఎన్నికై నారా చంద్రబాబునాయుడు క్యాబినెట్లో హ్యాండ్లూమ్, ఎక్సైజ్ మరియు బీసీ సంక్షేమం, సాధికారత, అనేమూడుపోర్టు పోలియోలతో తొలిసారిమంత్రి పదవిని పొందారు. ఏప్రిల్ 2017లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో న్యాయశాఖ, నైపుణ్యాభివృద్ధి, యువత, క్రీడలు, నిరుద్యోగ, ఎన్ఆర్ఐ మంత్రిగా నియమితులయ్యారు. మచిలీపట్నం పోర్టు సాధనకు భూ సేకరణకు అంకురం వేసి, 2019లో వైసిపి గాలిలో ఓడినా, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతిపక్ష కుట్రలోపావుగామారి 54 రోజులు పాటు జైలు జీవితం గడిపి, జైలునుంచి బయటకువచ్చిన తర్వాత మొక్కవోని ధైర్యంతో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి పై 52 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించి కృష్ణా జిల్లాకు ఏకైక మంత్రిగా రెండోసారి కూడా ప్రమాణ స్వీకారం చేయడం గర్వించదగ్గ పరిణామం. కొల్లు రవీంద్ర భార్య నీలిమ కొల్లు ఫౌండేషన్ ద్వారా చేసిన సేవలు చిరస్మరణీయం.

ఆకట్టుకున్న 'పర్యావరణ ప్రాణదాతలు'

విశాలాంధ్ర-చల్లపల్లి : ఎన్టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ పార్కులో జరుగుతున్న నాటక ప్రదర్శనల్లో భాగంగా నిర్వహించిన పర్యావరణ ప్రాణదాతలు సాంఘిక.. సందేశాత్మక నాటకం విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు స్వీయ రచన.. దర్శకత్వంలో వారి కుటుంబ సభ్యులు ప్రధాన పాత్రధారులుగా నటించారు. తాటి చెట్టు ఉపయోగాలు, ప్రకృతిని ఎలా నాశనం చేస్తున్నారు, పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై సాగిన నాటకంలో స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం, పర్యావరణ పరిరక్షణ.. పరిశుభ్రత కోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతృత్వంలోని స్వచ్ఛ ఉద్యమం గురించి చెబుతూ డీఆర్కే దంపతులను..స్వచ్ఛ కార్యకర్తలను వేదికపైకి ఆహ్వానించి నాటకాన్ని ముగించారు. చిన్న పిల్లల పాత్రధారులకు జాషువా(చెప్పులు కుట్టే పాత్రధారి)గా నటించిన బోలెం రామారావు.. దేశ నాయకుల ఫొటోలు చూపిస్తూ వారి జీవిత విశేషాలు..గొప్పతనాన్ని చెబుతూ స్ఫూర్తిని నింపే ప్రయత్నం ఆకట్టుకుంది. బోలెం రామారావు ప్రధాన పాత్రలో నటించగా, ప్రముఖ కోలాటం గురువు వేముల అంకంబొట్లు, ఏవో బోలెం ఆనంతలక్ష్మి, నాగ మునేష్, నిర్ధేష్ సాయి, జన్ని లు నటించారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి రాజీనామా

విశాలాంధ్ర-పమిడిముక్కల: వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు (హనుమంతపురం) తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైకాపా ఓటమి చెందటంతో తన రాజీనామా లేఖను బీసీ కార్పొరేషన్ సెక్రటరీకి మెయిల్ ద్వారా పంపినట్లు పేర్కొన్నారు.

గుండె పోటుతో మృతి

విశాలాంధ్ర-గన్నవరం : ఉంగుటూరు మండలం పొట్టిపాటి టోల్‌గేటు వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వస్తూ నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నాయుడు దేవా (45) మృతిచెందాడు. ఎండతాకిడి తట్టుకోలేక సొమ్మసిల్లి గుండెపోటుతో మృతి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యులు తెలిపారు.

కూటమి ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన జనం

విశాలాంధ్ర-పెదపారుపూడి: టిడిపి, బిజెపి, జనసేన పార్టీల కూటమి ప్రమాణ స్వీకారోత్సవానికి మండలం నుండి కేసరపల్లి ప్రాంగణానికి అన్ని గ్రామాల, ఆయా పార్టీల శ్రేణులు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఆ పార్టీ సీనియర్ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం తరలి వెళ్లారు. మండలంలోని దూళ్ల వానిగూడెం నుండి దాసు రమేష్, తూము రమేష్, నక్క శ్రీను, మదిరి శ్యామ్, మద్దూరి రవి, కత్తుల యాకోబు, మదిరి జక్కయ్య, నక్క శ్రీనివాసరావు, మద్దాల ప్రభాకర్, కత్తుల అబ్రహం, దాసు రమేష్, దాసు రాజేంద్రప్రసాద్, దాసు మూర్తి, కత్తుల ప్రవీణ్, గంట అనిల్, గంట వినోద్, తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగిలిన మంత్రుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి. బుధవారం గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటి పార్క్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు చేత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొణిదెల పవన్ కళ్యాణ్, కింజరపు అచ్చన్నాయుడు, నారా లోకేష్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, అనిత వంగలపూడి, సత్య కుమార్, నిమ్మల రామానాయుడు, ఎన్ ఎం డి ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావులకేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్రెడ్డిలతో రాష్ట్ర మంత్రులుగా రాష్ట్ర గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, సినీ నటులు మాజీ కేంద్ర మంత్రి కొణిదల చిరంజీవి ఇతర ప్రముఖులు, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

గన్నవరంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

విశాలాంధ్ర-గన్నవరం : ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహెూత్సవానికి బుధవారం గన్నవరం విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి నారా చంద్రబాబు నాయుడు ఘన స్వాగతం పలికారు. ఉదయం 10:55 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి భారత

ప్రధానికి, టిడిపిఅధినేతతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్రడిజిపి హరీష్ కుమార్ గుప్తా, కృష్ణాజిల్లాకలెక్టర్ డీకే బాలాజీ, జిల్లాఎస్పీఅద్నాన్ నయీమ్ అస్మి, బిజెపి నాయకులు సోమువీర్రాజు, స్టేట్ మీడియా ఇంచార్జ్ పాటూరినాగభూషణం, జిల్లాఅధ్యక్షుడుగుత్తికొండ శ్రీరాజ బాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడుకుమారస్వామి, జనసేన రాయల సీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత, శ్రీకాళహస్తి ఇన్చార్జి వినూతకోటా, అధికార ప్రతినిధులు పి గౌతమ్ రాజ్, శ్రీకాంత్, టిడిపి పొలిటికల్ సెక్రటరీ టిడి జనార్ధన్ రావు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, ఇతర రాజకీయ ప్రముఖులు ఘనస్వాగతం పలికారు.

ప్రధాని నరేంద్రమోడికి స్వాగతం

విశాలాంధ్ర-గుడివాడ : ప్రధాని నరేంద్ర మోడీకి బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకరానికి వచ్చిన సందర్భంగా గన్నవరం ఎయిర్‌పోర్టులో బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు స్వాగతం పలికి అయనకు పుష్ప గుచ్చం అందజేశారు. అయన వెంట బిజెపి నాయకులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ యాజమాన్యాల లో కొనసాగుతున్న పాఠశాలలకు బుధవారం స్టూడెంట్ కిట్లు(విద్యా కానుక) లను పంపిణీ చేశారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారిణి-2 కాటూరి శ్రీలక్ష్మి ఆయా పాఠశాలల బాధ్యులకు అందజేశారు. పాఠశాలల పునః ప్రారంభ రోజైన గురువారం విద్యార్థిని విద్యార్థులకు అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు తాతా సమర్పణ రావు (కూచిపూడి), పంది కృష్ణార్జునరావు (నిడుమోలు), సిహెచ్ నాగ హిమజ (కాజ), సిహెచ్ నాగరాజు (కోసూరు), చలమలశెట్టి శ్రీమన్నారాయణ (మొవ్వ), కంచర్ల ఆంజనేయులు (పెడసనగల్లు) పాల్గొని ఎంఈఓ-2 కే .శ్రీలక్ష్మికి సహకరించారు.

సమస్యలతో పాఠశాలలు స్వాగతం

-నేటి నుండి మోగనున్న బడి గంటలు

-సెలవులకు బై బై .. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఆందోళన

-ప్రైవేటు పాఠశాలల్లో దోపిడికి అడ్డుకట్ట వేసేది ఎవరూ?

విశాలాంధ్ర-అవనిగడ్డ : సెలవులలో ఆట పాటలతో సేదతీరిన విద్యార్థులకు నేటి నుండి పాఠశాలు స్వాగతం పలుకుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం గురువారం నుండి ప్రారంభం కానుండగా దివిసీమలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు నూతన ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించింది. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యా ప్రమాణాలు పెంపొందించడంతో పాటు మౌలిక వసతులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా కొన్ని పాఠశాలలకు మెరుగులు దిద్దిన విషయం తెలిసిందే. నూతన విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం కొన్ని మార్పులు చేసినప్పటికీ పెద్దగా కొన్ని ఆచరణలో మాత్రం అమలు కాలేదు. విద్యా కానుక పంపిణీ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వస్తువులను కిట్ల రూపంలో అందించేందుకు అధికారులు సిద్ధం చేయగా నూతనంగా రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నూరు శాతం ప్రారంభం రోజునే విద్యాకానుక పంపిణీకి శర వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ముగిసిన వేసవి సెలవులతో పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు చిన్నారులు సిద్ధం అవుతూ ఎక్కడో మూలన ఉన్న స్కూల్ బ్యాగ్‌లను సైతం బయటకు తీసి దులిపే కార్యక్రమంలో ఉన్నారు. దివిసీమలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పాఠశాలల్లో సమస్యలతో విద్యార్థులు గత సంవత్సరాలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలతో పాటు కొన్ని ప్రభుత్వ పాఠశాలలు కూడా మౌలిక అవసరాలైన ఆట స్థలం, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురౌతున్నారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ఫిట్‌నెస్ లేని బస్సులపై ప్రైవేటు పాఠశాలల్లోని దోపిడికి అడ్డుకట్ట వేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల సమస్య రాజ్యమేలుతుండగా విద్యార్థులకు సంబంధించి అన్నీ వసతులను పాఠశాలల్లోని కొనుగోలు చేయాలంటూ తల్లిదండ్రులపై వత్తిడి చేస్తున్న తరుణంలో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ మాత్రం కొరవడిందనే చెప్పవచ్చు. పలు విద్యార్థి సంఘాలు, నేతలు గత 3 సంవత్సరాలుగా ఈ విషయాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికి మండల స్థాయి అధికారుల హాజమాయిషీ మాత్రం మచ్చుకైన కనిపించడం లేదు. ఈ నూతన విద్యా సంవత్సరంలోనైన, ప్రైవేటు పాఠశాలలపై దృష్టి సారించి కళ్ళెం వేస్తారో లేదో అనేది విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థుల కొరత తీరేనా?

విశాలాంధ్ర-కూచిపూడి : నేటి నుంచి ప్రారంభమయ్యే పాఠశాలల్లో కొన్నింటిలో విద్యార్థుల సమస్య పట్టిపీడిస్తోంది. గత ప్రభుత్వ జగన్మోహన్ రెడ్డి హయాంలో భౌతిక, మౌలిక వనరులపై దృష్టి సారించినా విద్యార్థుల కొరత ఏర్పడడంతో ఆ పాఠశాలలు మూసివేసే యోచనలో ఉన్నట్లు సమాచారం!!. ఈ స్థితిలో పలు సమస్యలతో 2024-25 విద్యా సంవత్సరం స్వాగతం పలుకుతోంది. ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలల్లోని3,4,5 తరగతులను సమీపంలోని జిల్లా పరిషత్ హై స్కూల్స్ విలీనం చేయడంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనితో ఆ పాఠశాలలో మూసివేసే స్థితికి చేరుకొంటున్నాయంటేదానికి గత పాలకుల నిర్లక్ష్య వైఖరేనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది ఏప్రిల్ 23 నాటికి పాఠశాలలు ముగిసే

నలుగురు విద్యార్థులతోనే కొనసాగుతున్న చినముత్తేవి (ఆర్) పాఠశాల

సమయానికిచినముత్తేవి (రెగ్యులర్) ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో ఐదుగురు, అవురిపూడి (ఏ ఏ) పాఠశాలలో నలుగురు, నిడుమోలు లాకు పాఠశాలలో ముగ్గురు, నిడుమోలు శివారు వీరాయిలంక ఎలిమెంటరీ పాఠశాలలో ఆరుగురు, కాజ శివారు ఎం ఎం పల్లె ఎలిమెంటరీ పాఠశాల లో 8 మంది పిల్లలతో కొనసాగాయి.. ఆయా ప్రాంతాలలో బడికి వెళ్లే బడి ఈడుపిల్లలు లేకపోవడమే అందుకు కారణం అని విద్యాశాఖ అధికారుల సర్వేలో తేలింది. గురువారం నుంచి ప్రారంభమయ్యే పాఠశాలల్లో కొన్నింటికి విద్యార్థుల కొరత సవాలుగా మారనుంది. వీటిపై కొత్తగా కొలువు తీరిన ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొంటుందో వేచిచూడాల్సిందే నాని పరిశీలకులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో రికార్డులు మండలి సొంతం

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గంలో మండలి బుద్ధప్రసాద్ రికార్డులను బ్రేక్ చేస్తూ తన సొంతం చేసుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో మండలి బుద్ధప్రసాద్ చరిత్ర సృష్టించారు. ఇప్పటి వరకు 18 పర్యాయాలు ఎన్నికలు జరుగగా నియోజకవర్గంలో ముగ్గురు నాయకులను మూడేసి పర్యాయాలు గెలిపించిన నియోజకవర్గ ప్రజలు మండలి బుద్ధప్రసాద్‌ను మాత్రం 4 వ సారి అఖండ విజయాన్ని చేకూర్చడంతో మండలి బుద్ధప్రసాద్ నూతన రికార్డు సృష్టించారు. చల్లపల్లి జమీందార్, మంతురాజా, యార్లగడ్డ శివరామ ప్రసాద్ 3 పర్యాయాలు, దివిసీమ గాంధీగా పేరొందిన మండలి వెంకట కృష్ణారావు 3 పర్యాయాలు, దేవుడు మంత్రిగా పేరొందిన సింహాద్రి త్యనారాయణరావులు మూడేసి పర్యాయాలు గెలుపొందారు. వీరి రికార్డులను తిరగ రాస్తూ నియోజకవర్గం నుండి నాల్గోవ సారి విజయ పతాకాన్ని ఎగురవేసి రికార్డు సొంతం చేసుకున్నారు. నాల్గోవ పర్యాయం గెలిచిన మండలి బుద్ధప్రసాద్ రికార్డు మేజారిటీలోనూ అద్భుతాన్ని సృష్టించారు. 1999లో తొలిసారి నాటి రాజకీయ ప్రత్యర్ధి బూరగడ్డ రమేష్ నాయుడుపై గెలుపొందగా, 2004వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లోనూ బూరగడ్డ రమేష్ నాయుడుపై 8,400 పై చిలుకు ఓట్ల మేజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయాన్ని అందుకున్నారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమీప అభ్యర్థి అంబటి బ్రాహ్మణయ్యపై 417 స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన మండలి 2014లో ఆవిర్భవించిన నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబుపై 5,900 పై చిలుకు ఓట్ల మెజార్టీతో తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేసి మూడవ సారి బుద్ధప్రసాద్ ఘన విజయం సాధించారు. 3 వ సారి విజయం సాధించిన మండలి అసెంబ్లీలో తొలి ఉపసభాపతిగా సేవలందించి 2019 లో అదే సింహాద్రి రమేష్ బాబుపై ఇరవై ఒక్క వేల ఓట్ల తేడాతో మండలి ఓటమి పాలయ్యారు. అయినప్పటికి ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తన గళాన్ని వినిపిస్తూ అలుపెరుగని పోరాటాలు చేస్తూ డిఎస్‌సి అభ్యర్ధులకు , ఉపాధ్యాయ పోస్టుల సాధన కోసం, పులిగడ్డ ఆక్విడెట్ పటిష్ఠత కోసం, రైతులకు నష్టపరిహారం, సకాలంలో బిల్లుల సాధన కోసం, దివిసీమలోని చివరి భూములకు సాగునీటి సాధన కోసం, వైసిపి నేతలు చేస్తున్న ఇసుక, బుసుక, నల్ల ఇసుక దోపిడిని అడ్డుకోవడం వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యారు. ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్న మండలి బుద్ధప్రసాద్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి జనసేన అభ్యర్థిగా తెలుగుదేశం, బిజెపి పార్టీల సంపూర్ణ మద్దతుతో కనివిని ఎరుగని స్థాయిలో ప్రత్యర్ధి సింహాద్రి రమేష్ బాబుపై 46,434 ఓట్ల ఆధిక్యంతో విజయాన్ని 4వ సారి రికార్డు సొంతం చేసుకున్నారు.

గ్రామాల్లో సంబరాలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బుధవారం గన్నవరం సమీపంలోని కేసంపల్లి వద్ద ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, మంత్రిగా జనసేన అధిపతి కొణిదల పవన్ కళ్యాణ్ తో పాటు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు పలువురు మంత్రులుగా అశేష అభిమానుల మధ్య నిర్వహించిన ప్రమాణ స్వీకార మహెూత్సవం సందర్భంగా గ్రామాలలో సంబరాలు చేసుకున్నారు. దీనిలో భాగంగానే మొవ్వ మండలంలోని గ్రామాలలో నిర్వహించిన సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ కార్యక్రమాలను తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు పాల్గొని బాణాసంచా కాల్చి కేకులు కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేసుకొన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో కొనసాగిన ఈ వేడుకలతో గ్రామాలు పండుగ వాతావరణాన్ని తలపింపచేశాయి. మండల, జిల్లాస్థాయి నాయకులు పలువురు ప్రమాణ స్వీకారం మహెూత్సవం ప్రత్యక్షంగా తిలకించడానికి ప్రాంగణానికి తరలి వెళ్లారు.

కారకంపాడులో...

సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరు జిల్లాలోని నూజివీడు శాసనసభ్యులుగా ఎన్నికై బుధవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో ఆయన స్వగ్రామమైన కృష్ణాజిల్లా అయ్యంకి పంచాయితీ శివారు కారకంపాడు లో పండగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు పలువురు హర్షం వ్యక్తంచేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ కొణిజేటిరోశయ్య, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాలో మంత్రిగా కొనసాగిన పార్థసారథి గత ప్రభుత్వ హయాంలో శాసనసభ్యులుగా కొనసాగారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి అత్యంత మెజార్టీతో విజయం సాధించిన సారథిని మంత్రి పదవి వరించింది. బిసి (యాదవ) సామాజిక వర్గానికి చెందిన ఆయన అభిమానులు, సామాజిక వర్గీయులు పలువురు ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. దీనిలో భాగంగానే మొవ్వ లో బీసీ నాయకుడు గౌర్రిపర్తి వెంకటరమణయాదవ్ సారధ్యంలో బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు.

సచివాలయంలో కూటమి నాయకుల చిత్రపటాలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి(తెలుగు దేశం,జనసేన, బిజేపి) పార్టీ ఘన విజయం సాధించిన విషయం పాఠకులకు విదితమే.బుధవారం మంటాడ సచివాలయంలో ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి చిత్ర పటాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సనకా కిరణ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలు సందర్భంగా మండలంలో మొదటి గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార సంబరాలు

విశాలాంధ్ర-పెడన : గన్నవరం నియోజకవర్గం కేసరిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా పెడన పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి.పట్టణంలో సైకో పాలన పోయింది సంక్షేమ పాలన వచ్చిందంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. బస్టాండ్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 14వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. అక్కడ చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఇక్కడ పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ దాదాపు 40 లక్షల మంది సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలలో పనిచేసే ఇక్కడ జగన్మోహన్ రెడ్డి వల్ల జీవనోపాధి కోల్పోయి ఆంధ్రప్రదేశ్లో దుర్మార్గమైనటువంటి ప్రభుత్వాన్ని అంతమొందించి ప్రతి ఒక్క ఉద్యోగికి అన్ని వర్గాల వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కమ్మగంటి వెంకటేశ్వరరావు, చందన్ నారాయణరావు, వేలికట్ల ప్రసాద్, వీనం శీను, బొడ్డు ఆనందరావు, ఇమ్మడి నాగపో తరావు, బల్ల సుబ్రహ్మణ్యం, అనుముల పూర్ణచంద్రరావు, తమ్మా. భీమయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలశౌరికి బండి రామకృష్ణ అభినందనలు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికైన వల్లభనేని బాలసౌరిని విజయవాడ పార్టీ కార్యాలయంలో కలిసి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు రాజకీయల పై చర్చించారు రేపు మచిలీపట్నంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని బాలశౌరి తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, మండల పార్టీ అధ్యక్షులు గల్లా తిమోతి, నెలకురు సర్పంచ్ బొమ్మసాని నరేష్ తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి గురువారం ఉదయం నుండి ఉదయం 9 గంటల నుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రజలకి అందుబాటులో ఉంటానని తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

సామాజిక బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం జూన్ 12 సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంయుక్త ఫౌండేషన్,కార్మిక శాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖలు స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం ప్రతి ఏటా జూన్ 12న నిర్వహించడం జరుగుతుందని, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన చైతన్యం తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి మరియు అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్ఓ వారి సంయుక్త ఆధ్వర్యంలో అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని 2002 నుండి నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బడి బయట ఉన్న బాలలందరినీ బడిలో చేర్చుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాలల హక్కుల పరిరక్షణకు కలిసి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంయుక్త ఫౌండేషన్ కార్మిక శాఖ మహిళా,శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్,అంబేద్కర్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగా జోషి,కార్మిక శాఖ అధికారులు శ్రీనివాసరావు, మహేశ్వరరెడ్డి, రత్నకుమారి,డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం రాజేశ్వరరావు,డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు కిరణ్ కుమార్, శారద,రాణి,బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్,బచ్పన్ బచావో ఆందోళన్ (బీబీఏ) కోఆర్డినేటర్ కే.శ్రీకాంత్, వాసవ్యమహిళా మండలి ప్రతినిధులు హృదయరాజు, మోహనకృష్ణ, సునీల్, సంయుక్త ఫౌండేషన్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు భిక్షమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహప్రసాద్ అన్నారు. ఎస్టీయూ కార్యాయలంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన వివిధ రకాల సమ్యల పై సమావేశం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న ఎస్ఏలకు నిర్దిష్టమైన జాబ్ చార్జ్ తెలియజేయాలన్నారు. అడ్మిషన్లు లేని పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులను రద్దు చేయాలని కోరారు. గతంలో సబ్జెక్ట్ టీచర్ అలవెన్స్(2,500) పై పని చేసిన ఎస్ఏలకు ఇంత వరకు ఆ అలవెన్స్ అందలేదని తెలిపారు. వేసవి సెలవులలో వివిధ రకాల విధులు నిర్వహించిన ఉపాద్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవులు కోసం సీఎస్ఈ వారికి ప్రాతినిధ్యం కలిగించాలని అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయిలో మూడు నెలలకు ఒకసారి యూనియన్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి, ఎంఈవోలకు ఉత్తర్వులు ఇవ్వాలని చెప్పారు. జిల్లా స్థాయిలో కూడా మూడు నెలలకు ఒకసారి అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లాలో వివిధ క్యాడర్లలో పదవీ విరమణ సందర్భంగా ఏర్పడిన ఖాళీలను వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. అలాగే విజయవాడ మున్సిపాలిటీలో సమ్యలను పరిష్కారించాలని, మున్సిపాల్ ఉపాధ్యాయుల ప్రమోషన్ల కోసం కామన్ సీనియార్టీ జాబితాను మెరిట్ కం రోస్టర్ ప్రకారం లేదని, దానిని సరి చేయాలని చెప్పారు. నాలుగు మండలాలలోని ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ చేయించాలని సూచించారు. హెచ్.ఎం.ప్యానల్ ఏర్పాటు చేసి హెచ్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 జూన్ 30న స్కూల్ సూపర్‌వైజర్ వ్యవస్థ రాష్ట్ర వ్యాప్తంగా రద్ద అయినందున సూపర్‌వైజర్ కోసం ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేయకుండా చూడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్ ఎరియర్ బిల్లు పరిష్కారించాలని చెప్పారు. ఎంఈవో కార్యాలయంలో సరిపడా సిబ్బంది నియమించాలని అన్నారు. వీయంసీ నుండి అధికారికంగా అన్ని పత్రాలు తెప్పించాలని అన్నారు. ఈ సమస్యలను పరిష్కారించాలని ఎన్టీఆర్ జిల్లా ఎస్టీయూ శాఖ డిమాండ్ చేసింది.

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జిల్లా ఉపాధి కార్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణ జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జూన్ 14వ తేది విజయవాడలోని జిల్లా ఉపాధి కల్పన అధికారి వారి కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ ఐ.టి.ఐ కాలేజీ నందు మేగా జాబ్ మేళా నిర్వహించనున్నారు అని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి.విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేగా జాబ్ మేళాలో లైఫ్ స్టైల్, జ్యోతి ఫెసిలిటీ మేనేజ్మెంట్,యాక్సిస్ బ్యాంక్,వరుణ్ మోటార్స్, విజేత స్టోర్స్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ సాయి ఎంటర్ప్రైజెస్, మాత్రే హెచ్.ఆర్ ప్రైవేట్ లిమిటెడ్, జయలక్ష్మి సి ఫుడ్స్, జే న్యూస్ సెక్యూరిటీస్ వంటి కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. కావున జిల్లాలోని పదవ తరగతి ఐటిఐ డిప్లమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగుల పూర్తి బయోడేటా ధృవ పత్రాలు జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జీత భత్యం 12 వేల నుండి 25 వేల వరకు వేతనం లభిస్తుందని తెలియపరిచారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్ సైట్ లో వివరములు నమోదు చేసుకోగలరు. ఇతర వివరములకు 8142416211 ఫోన్ నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

కూటమికి శుభాకాంక్షలు

ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తాడికొండ రంగబాబు

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీలో భారీ మెజారిటీతో గెలుపొందిన కూటమి ప్రభుత్వానికి ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తాడికొండ రంగబాబు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని చాంద్ కళ్యాణమండంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా వివిధ అనారోగ్య, ప్రమాదవశాత్తు మరణించిన వడ్రండి వృత్తిదారులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ కేంద్రంలో కానీ, రాష్ట్రంలో కానీ కూటమి పార్టీల భాగస్వామ్యంతో ప్రభుత్వం ఏర్పడటం శుభసూచకమని చెప్పారు. నూతన ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కార్పెంటర్లు పనిచేసేటప్పుడు జరిగే ప్రమాదాలు, బిల్డింగ్ మీద నుండి పడిపోవడం లాంటి ప్రమాదాలక ఆరోగ్యశ్రీ వైద్యం అందలేదని, ఇప్పుడు తమ కార్మికులకు దగ్గరలో ఉండే ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటనే వైద్యం జరిగేలా ఒక నూతన పాలసీని ప్రభుత్వం ప్రవేశ పెట్టాలని కోరారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఏవిధమైన షూరిటీ లేకుండా ఇస్తున్న ఋణం ఆయా వడ్రండి కార్మికులకు వారి అవసరాలకు అనుగుణమైన ఏవస్తువులైన కొనుగోలు చేసేలా పెట్టుబడి సాయంగానే పరిగణించేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల వారు వారాలన్న, ఇక్కడ ప్రయోజనాలు పొందాలన్నా ఇక్కడి వారని కూడా దృష్టిలో పెట్టుకుని కచ్చితంగా వారికి ఏదో ఒకరకమైన లబ్ది కలిగేలా చూడాలని సూచించారు. ఈ ప్రభుత్వానికి కార్పెంటర్లు సహకారం అందిద్దామని 26 జిల్లాల నుంచి వచ్చిన నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెదపూడి నరసింహ మూర్తిని బాధ్యతలు అప్పగించారు. కోశాధికారి షేక్.షంషీర్, ఉపాధ్యక్షులు వీరబ్రహ్మాయ్యచారి, చిన్నబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమారాచారి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-కంచికచర్ల: ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పురస్కరించుకొని కంచికచర్ల మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ర్యాలీ బంకు సెంటర్ నుంచి బయలుదేరి సెంట్రల్ బ్యాంక్ రోడ్డు మీదుగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇంటి వద్దకు చేరుకున్నది. అక్కడ నుంచి మరల గొట్టుముక్కల రోడ్డు మీదుగా నెహ్రూ సెంటర్ ప్రధాన జాతీయ రహదారి మీదుగా సాగి వినాయకుడి గుడి వద్ద మహిళలు101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రామాలయం మీదుగా చెవిటికల్ సెంటర్,పెద్ద బజారు,కుర్ర వారి బజార్ వరకుఈ ర్యాలీ చేరినది.ఈ సందర్భంగా మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు మాట్లాడుతూ ఏపీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్త ఓంకార్ టౌన్ పార్టీ అధ్యక్షులు వేమా వెంకట్రావు తాడపనేని లక్ష్మణ రావు,అట్లూరి నాని,రాష్ట్ర బి సి సెల్ కార్యదర్శి అల్లాడి కోటేశ్వరరావు, అనుమోలు వాసు, గుత్త మాధవి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నన్నపనేనిలక్ష్మి, నల్ల నాగుల అరుణ , కంభంపాటి రమాదేవి,కుర్ర కరుణ ,దమ్మాలపాటి పార్వతి, ప్రసూన,కొరిటల శివపార్వతి, మాగంటి వరలక్ష్మి, టి శ్రావ్యా, గుత్త రమేష్, ఫణి ,నగరికంటే ఏసోబు, జూలూరు విశ్వనాథం, జంపని ప్రసాద్, తెదేపా నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర నెడ్ కాప్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి వేల్పుల రాజీనామా..

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెడ్ కాప్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి వేల్పుల రవికుమార్ బుధవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో నూతనంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తనకు తగిన గౌరవాన్ని కల్పించి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వడంపై ఆయన జగన్మోహన్‌రెడ్డికి, ఈ పదవి రావడానికి కృషి చేసిన నాటి ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకి, పెద్దలకు అధికారులకు, రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా ప్రజలు మరల జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎన్నుకోలేదని అన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల కూటమి ప్రజలకు అనేక వాగ్దానాలను ఇవ్వడంతో అధికారంలోకి వచ్చిందని చెప్పారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అమలుపర్చిన పథకాలకు అనేక రెట్లు జోడించి, తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని కూటమి ప్రజలకు వాగ్దానం చేసి గెలుపొందిందని రవికుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుండి రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో పనిచేసిన మంత్రుల పైన వారి ఇండ్ల పైన ఎమ్మెల్యేల ఇండ్ల పైన, వైయస్సార్సీపి కార్యకర్తల ఇళ్ల పైన రాళ్లతో మారణాయుధాలతో, అనేక రకాల దాడులు నిర్వహిస్తున్నదని రవికుమార్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో హింసకు, దౌర్జన్యాలకు, స్థానం ఉండబోదని, అటువంటి చర్యలను ప్రజలు ఉపేక్షించరని రవికుమార్ అన్నారు. మంగళవారం నాడు వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాను తన సతీమణి వేల్పుల పద్మకుమారితో కలిసి మాట్లాడామని, జగన్మోహన్‌రెడ్డి అత్యంత ధైర్యంగా, గుండె నిబ్బరంగా ఉన్నారని, రాష్ట్రంలో వారు త్వరలోనే పర్యటన చేయనున్నారని రవికుమార్ తెలిపారు. గాయపడిన కార్యకర్తలను, దాడికి గురైన నాయకులను స్వయంగా కలిసి పరామర్శిస్తానని జగన్ మోహన్‌రెడ్డి తనకు చెప్పారని రవికుమార్ అన్నారు. కార్యకర్తల కోసం ఎటువంటి త్యాగాలు చేయడానికి అయినా వైఎస్ఆర్సిపి నాయకులు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు కూడా ఎటువంటి ఇబ్బందులు దాడులు జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నారని రవికుమార్ తెలిపారు..... నూతన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి పదం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు.

గంగవరపు మురళి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం స్క్రీన్లు ఏర్పాటు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్డీయే కూటమి తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం వేడుకలు బుధవారం ఉదయం తెదేపా సీనియర్ నాయకులు గంగవరపు మురళీ ఆధ్వర్యంలో సితార సెంటర్లో ఘనంగా నిర్వహించారు. గంగవరపు మురళీమోహన్ కార్యాలయం వద్ద ఎల్ ఈ డి స్క్రీన్ ఏర్పాటు చేశారు. నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి గా నాలుగో సారి పట్టాభిషేకం దృశ్యాలు గంగవరపు మురళి ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ పై వందలాది మంది తిలకించారు. ప్రమాణ స్వీకారం మహోత్సవం పూర్తి కాగానే ఇక్కడ బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పట్టారాని ఆనందంతో శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరపు మురళితో పాటుగా నర్రావంశీ, సాయిసుధాకర్, సోమశేఖర్, నాగుల్ మీరా, మల్లె బోయినకొండ, వీరారెడ్డి, గాలిషా, మాల కొండయ్య, రెడ్డిమోహన్, జగన్, హేమసుందర్, కుమార్, లోకేష్, అఖిల్, తదితరులు పండుగ చేసుకొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-తుళ్ళూరు : అమరావతి రాజధాని ప్రాంతమైన తుళ్లూరు లో తెలుగుదేశం పార్టీ మండల తెలుగు యువత ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు మూల్పురి నరేష్ చౌదరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి దానినేని శ్రీనివాసరావు, తుళ్లూరు పార్టీ అధ్యక్షులు కాటా అప్పారావు, పువ్వాడ గణేష్ పాల్గొన్నారు.

అమరావతిలో రైతుల సంబరాలు:

రాజధాని ప్రాంతమైన అమరావతి రైతులు, మహిళలు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్ర బాబు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో టీడీపీ రైతు జెండాలు చేత బూని రోడ్డుపైకి వచ్చి సంబరాల్లో మునిగిపోయారు. రైతు శిబిరాల్లో ఎస్ ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం లైవ్ కార్యక్రమాన్ని వీక్షిం చారు. అమరావతి రైతుల పాదయాత్రలో భాగమైన రైతు ప్రచార రథం కలియుగ వెంకటేశ్వర స్వామి వారి రథంతో సాయంత్రం ఐదు గంటలకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-తాడికొండ : విజయవాడ సమీపంలోని కేసరి పల్లెలో టీడీపీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి మండలంలోని టీడీపీ శ్రేణులు బుధవారం తరలి వెళ్లారు. ఉదయం నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, కారులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా ప్రమాణ స్వీకారానికి వెళ్లారు. ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టపాసుల మోత మారుమ్రోగింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు.

బడి బస్సు భద్రమేనా..?

-పాత బస్సులకు కొత్త రంగులు -పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-వత్సవాయి : రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి పాఠశాలలు ప్రారంభమవుతున్న విషయం తెలిసినదే కానీ విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేటు పాఠశాలలకు పంపాలంటే బడి బస్సులు భద్రమేనా..? అనే ప్రశ్న తలెత్తుతోంది.. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. వత్సవాయి మండలంలో గ్రామాల నుంచి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు తీసుకొచ్చేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. విద్యార్థులను రవాణా చేసినందుకు రవాణా ఛార్జీలను కూడా వసూలు చేస్తున్నారు. విద్యాసంస్థల యజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుమార్లు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. బస్సు సీట్లకు మించి విద్యార్థులను ఎక్కువగా చేరవేస్తున్నాయి. అయితే బస్సుల ఫిట్‌నెస్‌ను డ్రైవర్ కండీషన్‌ను పట్టించుకోవడం లేదు. ఇలాంటి బస్సులపై దష్టి సారించి పిల్లలకు ఎలాంటి ఆపద ఏర్పడకూడదని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్‌కు సంబంధించిన పరీక్షలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను ప్రతి సంవత్సరం బస్సులకు అందించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ స్కూల్సు ప్రారంభానికి ముందే ముగిసేట్లుగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ సంవత్సరం అధికారులు బస్సులు ఎంత మేర ఫిట్‌నెస్ ఉన్నాయనే దానిపై తనిఖీలు చేస్తూ విద్యాసంస్థల పునఃప్రారంభం వరకు సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు పాఠశాల భవనాలకు రంగులు వేస్తూ అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై మాత్రం దష్టి పెట్టడం లేదు. నేటి నుండి పాఠశాలలు ప్రారంభం అయినాయి... బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ నిర్వహించడం అంత తేలిక కాదు. మరోవైపు కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గడువు ముగిసినా విద్యా సంస్థల బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ సారైనా యాజమాన్యాలు పాఠాలు నేర్చుకుంటాయా....

ధనార్జనే ధ్యేయంగా ..

అర్హతలేని బస్సులకు మెరుగులు దిద్ది దర్జాగా తిప్పుతారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలపై నిర్లక్ష్యం బడి బస్సు ఫిట్‌నెస్ అర్హత సాధించాలంటే అనేక నిబంధనలున్నాయి. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లు వదలుతున్నారన్న ఆరోపణలున్నాయి. పాత బస్సులకు కొత్త రంగులద్ది బస్సులను నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాలను యాజమాన్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు. మండలాల్లోనే ఎక్కువగా పాఠశాలలు ఉండడం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా గడువు చివరి వరకు వేచి ఉండి హడావుడిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నట్లు సమాచారం. ఆర్‌టిఏ కార్యాలయంలో నమోదైన ఫిట్‌నెస్ బస్సుల సంఖ్య వివరాలు ఏటా పాఠశాల పునఃప్రారంభం నాటికి ఫిట్‌నెస్ కోసం బస్సులను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళు న్నా విద్యా సంస్థల నిర్వాహకులు వారికి సంబంధించిన ఏజెంట్ల ద్వారానే బడిబస్సును ఫిట్‌నెస్‌కు తీసుకె ళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.ప్రమాణాలపై అనుమానాలెన్నో..బడి బస్సుల ప్రమాణాలపై ప్రతి ఏడాది లాగానే.. ఎన్నో అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాలు ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటిస్తున్నాయా.. లేదా.. ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోయినా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసి వాటికి గ్రీన్‌సిగల్ ఇస్తున్నారా? అనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సరిగా లేని బస్సులకు చిన్న చిన్న మరమ్మతులు చేసి రంగులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు పంపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలపై పూర్తి స్థాయిలో దష్టి సారించని అధికారులు హడావుడిగా ఆ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని, తద్వారా ఈ పరీక్షలు తూతూ మంత్రంగా సాగుతాయని పలువురు పేర్కొంటున్నరు అధికారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిందేనని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

స్కూలు బస్సు నిబంధనలు :

- బస్సులు అగ్నిమాపక నివారణ పరికరం ఉండాలి..
- ప్రతి సంవత్సరం తనిఖీ చేయాలి
- బస్సు డ్రైవర్ వయస్సు 60 ఏళ్లకు మించి ఉండకూడదు.
- డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ మాట్లాడకుండా చూడాలి.
- ట్రాన్స్ పోర్ట్ వాహనం నడపడం లో ప్రత్యేక అనుభవం ఉండాలి.
- వాహనం నడుపుటకు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలి.
- బస్సు దిగుటకు భూమికి దగ్గరగా అదనపు మెట్లు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు పుస్తకాలు పెట్టుకొనేందుకు ర్యాక్‌లు ఏర్పాటు చేయాలి.
- బస్సు అద్దాల వద్ద ప్రత్యేక మయిన గ్రిల్స్ ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి.
- బస్సు వెనుక భాగం లో పెద్ద అక్షరాలతో పేరు, ఫోన్ నెంబర్ ఉండాలి.
- డ్రైవర్ ప్రతి మూడు నెలలకు ఒక్కసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

ఫిట్‌నెస్ విషయంలో రాజీ లేదు

నియోజకవర్గంలో మొత్తం 40 స్కూల్ బస్సులు ఉన్నాయని ఇప్పటికే 26 బస్సులకు అనుమతులు ఇచ్చాం ఫిట్నెస్ విషయంలో ఎక్కడ రాజీ పడం..

-రవికుమార్, ఎంవీఐ యూనిట్ ఆఫీసర్

ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

విశాలాంధ్ర-నందిగామ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీఏ శాసన సభా పక్ష నేతగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవానికి బుధవారం నందిగామ మండలం నుండి పెద్ద సంఖ్యలో తెలుగు దేశం, జనసేన, బిజెపి నాయకులు పలు వాహనాల్లో తరలి వెళ్లారు, తెల్లవారు జామునే నందిగామ మండల టిడిపి నాయకులు మన్నె కళావతి తోట నాగమల్లేశ్వరరావు, చెరుకూరు హైమారావ్, గాడిపత్తి శ్రీనివాసరావు, మన్నేపల్లి వినయ్,గాంధీ పలు గ్రామాల నాయకులు వాహనాల్లో కృష్ణాజిల్లా గన్నవరం కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ప్రమాణ స్వీకార సభ వెళ్లి తమ నాయకుల్ని కలిశారు, నారా చంద్రబాబు నాయుడు నాల్గవ సారీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నారా చంద్రబాబు నాయుడుకు గ్రామాలలో ప్రజలు ఆనందాన్ని వెళ్లబుచ్చుతూ బాణాసంచా కాల్చారు.కేసరపల్లి ఐటి పార్క్ సభాస్థలి వద్ద నందిగామ మండల టిడిపి నాయకులు ఫోటో

డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా సత్య స్వరూప్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (జనరల్) పి. సత్య స్వరూప్(ఐఆర్‌టిఎస్) బాధ్యతలు స్వీకరించారు.ఈయన ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ యొక్క 2015 బ్యాచ్‌కి చెందినవారు. కొత్త అసైన్‌మెంట్‌కు ముందు విజయవాడ డివిజన్‌లో డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా(మూమెంట్) పనిచేస్తున్నారు.సత్య స్వరూప్ శ్రీ నిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,హైదరాబాద్ నుండి బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ డిగ్రీని కలిగి ఉన్నారు.2019 నుండి 2021 వరకు తూర్పు రైల్వేలోని సీల్దా డివిజన్‌లోని చిట్‌పూర్‌లో భారతీయ రైల్వే ఏరియా అధికారిగా ఉన్నారు.తూర్పు రైల్వేలోని డిటిఎమ్(గూడ్స్) హౌరా డివిజన్‌గా కూడా పనిచేశారు.జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కి పదోన్నతి పొందిన అనంతరం విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (జనరల్)గా కొనసాగుతున్నారు.

2024 ఈఏపి సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన "శారద విద్యా సంస్థలు"

2024 ఈఏపి సెట్ ర్యాంకులు

ఆర్ సింధు సిరి	ఎ. మధు మేఘన	యస్.సంగీతలక్ష్మీ	వి.తోరణ్ కార్తీక్	ఎ.సంపత్	ఎ. సంజయ్
484	543	588	1058	1065	1070

విశాలాంధ్ర-విజయవాడ (ఎడ్యుకేషన్): ఈనెల 12వ తేదీన ప్రకటించిన ఈఏపి సెట్ -2024 ప్రవేశ పరీక్ష ఫలితాలలో విజయవాడ మొఘల్ రాజపురంలోని శారద విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఆర్ సింధు సిరి (484) ఎ. మధు మేఘన (543), యస్. సంగీత లక్ష్మీ (588), వి. తోరణ్ కార్తీక్ (1058), ఎ.సంపత్ (1065), ఏ సంజయ్ (1070), ఎం లావణ్య (1160), ఎం శర్వాణి (1270), కే నాగ రాహుల్ (1423), సి.హెచ్ శ్రీ సిద్ధార్థ (2109) సాధించి డే స్కాలర్స్ కాలేజీలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, తమ సంస్థలోని విద్యార్థులు అటు జెఇఇ మెయిన్స్లనే కాకుండా ఎంసెట్లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల ఛైర్మన్ డా? వై. రమేష్ బాబు తెలిపారు. తమ విద్యాసంస్థలకు చెందిన 120మంది విద్యార్థులు ఈఏపిసెట్ - 2024 ప్రవేశ పరీక్షలలో 10,000లోపు ర్యాంకులు సాధించారని, ఇలాంటి అత్యద్భుతమైన ఫలితాలను సాధించడం తమకు చాలా సంతోషంగా ఉందని ఈ విధమైన ర్యాంకులు సాధించడానికి చక్కని ప్రణాళిక, అధ్యాపకుల సలహాలు, సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని తెలియచేశారు. కేవలం 850 మంది విద్యార్థులతో ఏ.పి ఎంసెట్ -2024 ప్రవేశ పరీక్ష ఫలితాలలో సగం మందికి పైగా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని, తమ విద్యాసంస్థలలో చదివే ప్రతి విద్యార్థి కూడా జాతీయ స్థాయి రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించినందుకు చాలా ఆనందంగా ఉందని విద్యాసంస్థల యం.డి వై. శారదాదేవి తెలియచేశారు.ప్రతి సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు చదువులో ఎటువంటి ఒత్తిడి లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో, చక్కటి క్రమశిక్షణతో జాతీయ స్థాయి మరియు రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధిస్తున్నారని కళాశాల అడ్వైజర్ ఇ.యస్.ఆర్.కె ప్రసాద్ జి యమ్ జి వి రావు అన్నారు. అధ్యాపకులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు.

అన్నసమారాధన

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: స్వర్గీయ కత్తి లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కత్తి లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కత్తి సీతా మహాలక్ష్మి పాల్గొని స్వర్గీయ కత్తి లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కత్తి నాగేశ్వరరావు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ కత్తి లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదీన క్రమం తప్పకుండా గత 31నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కత్తి లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి వాటర్ కూలింగ్ ఫ్రిజ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాబోయే రోజులలో కత్తి లలిత ట్రస్ట్ సేవలు కొనసాగిస్తాని ట్రస్ట్ అధ్యక్షులు కత్తి నాగేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ కత్తి సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా స్వర్గీయ కత్తి లలిత జ్ఞాపకార్థం అన్న సమారాధన చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్వన్,జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసి విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: జయహో బీసీ సభలో విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం కట్టుబడి అమలు చేసి విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్ల శ్రీనివాస చక్రవర్తి సీఎం చంద్రబాబును కోరారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. టీడీపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు , విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్ల శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 8వ తరం ముని మనవడు వీరంభట్లయ్య స్వామి సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన నేపథ్యంలో సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి పూలదండలు వేసి సత్కరించారు. . ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో తమ సామాజిక వర్గం పూర్తిస్థాయి సహకారాన్ని అందించిందని పేర్కొన్నారు . ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో పెట్టిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం పీఠాధిపతి నియామకాన్ని వెంటనే వారసుల్లో ఒకరైన వారిని ఎంపిక చేసి ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించి తమ సామాజికవర్గాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమికి ఇంత విజయాన్ని కట్టబెట్టిన తమ సామాజిక వర్గానికి తగిన న్యాయం చేయాలని కోరారు . ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తమ సామాజిక అభివృద్ధి కి సహకరించాలని ఆకాంక్షించారు. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి వంశీయులు వీరంభట్లయ్య స్వామి మాట్లాడుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయవాడకు వచ్చిన తాను నేడు సామాజికవర్గంలోని విశ్వబ్రాహ్మణ కార్యాలయానికి రావడం జరిగిందని వెల్లడించారు. కూటమి గెలుపు కోసం పనిచేసిన జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీనివాస చక్రవర్తి సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి వారి భక్తులు పాల్గొన్నారు.....

సహకార బ్యాంకుల కోసం ఇమాక్. ఎఐ-కంపోజ్డ్ ఇంటెలెక్ట్ డిజిటల్ కోర్ని ప్రారంభించిన ఇంటెలెక్ట్

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట: ఇంటెలెక్ట్ డిజైన్ అరేనా లిమిటెడ్, సహకార బ్యాంకుల కోసం ఇంటెలెక్ట్ డిజిటల్ కోర్ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమగ్రమైన, ఎంటర్ప్రైజ్-గ్రేడ్ బ్యాంకింగ్ టెక్నాలజీ సూట్ ఇమాక్.ఎఐ (ఎంఏసీ.ఏ)తో రూపొందించబడిందన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓపెన్ ఫైనాన్స్ ప్లాట్ఫారమ్ అయిన 'ఫస్ట్ ప్రిన్సిపల్స్' థింకింగ్ ద్వారా ఆర్థిక సంస్థల భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సాంకేతిక పరిష్కారాలను రూపొందించడం ద్వారా రూపొందించబడ్డాయన్నారు. మూడు దశాబ్దాల డొమైన్ నైపుణ్యం 'డిజైన్ థింకింగ్'తో సహకార బ్యాంకుల కోసం రూపొందించిన ఇంటెలెక్ట్ డిజిటల్ కోర్ని ప్రారంభించారన్నారు. ఈ విలువ ఆధారిత సేవలను అందించడం ద్వారా యువతరం కస్టమర్ ఆకాంక్షలను తీర్చడం సహకార బ్యాంకులకు అత్యవసరమన్నారు ఎంటర్ప్రైజ్-గ్రేడ్ బ్యాంకింగ్ టెక్నాలజీ సూట్ టైర్-2 మరియు టైర్-3 నగరాల్లో అభివృద్ధి చెందుతున్న కస్టమర్ అవసరాలను తీరుస్తుంది. (ప్రారంభోత్సవం గురించి వ్యాఖ్యానిస్తూ, ఇంటెలెక్ట్ డిజైన్ ఎరీనా యొక్క సీఈఓ (ఇండియా మరియు సౌత్ ఏషియా), రమణన్ ఎస్.వి మాట్లాడుతూ, "భారతదేశంలో సహకార బ్యాంకులు పనిచేసే విధానాన్ని విప్లవాత్మకంగా

రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-గుడివాడ : ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడుకి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియచేశారు. బుధవారం స్థానిక ముబారక్ సెంటర్లో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జబీన్, షేక్ ఇబ్రాహీం, మొహమ్మద్ రఫీ, షేక్ కరిముల్లా, షేక్ రబ్బానీ, మౌలాలి, పట్టపు చిన్న, దాసు, బాజీ, అజ్మతుల్లా, మొబీన్, పైడి కోటేశ్వరరావు, చాన, బాజీ, భాష, అన్వర్, సత్తార్, సలీం, మున్న, రియాజ్, ఆయుభ, తదితరులు పాల్గొన్నారు. నూతనం ఏర్పాడిన రాష్ట్ర మంత్రి వర్గంలో 8మంది బిసిలకు చోటు కల్పించినందుకు బిసి సంఘం అధ్యక్షులు దారం నరసింహారావు అధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి పంపిణి చేశారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్లో బిసి సంఘల అధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నియోజవర్గ అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వరరావు, లోయ శివాజీలతో కలసి నియోజవర్గ బిసి సంఘం అధ్యక్షులు దారం నరసింహారావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన మంత్రి వర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బిసిలకు సముచిత స్థనం కల్పించినందుకు ప్రతేక ధన్యావాదలు తెలిపారు. ప్రత్యేకంగా కొల్లు రవీంద్ర, కొలుసు పార్ధసారధిలకు మంత్రులుగా ఉండడం బిసిలకు గర్వకారణమన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలతో క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణి చేశారు. ఈ కర్యక్రమంలో కొలుసు రాజా, గొర్ల శ్రీలక్ష్మీ, లోయ విజయ్, కర్నాటి రాంబాబు కొలుసు మురిలి, బోయిన రాజా, తోట శ్యామలరావు, తుమ్మ రమేష్, మసిముక్కు గోపాలకృష్ణ, బి.నాగరాజు, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో మొట్టమొదటి ఫీచర్ ఫోన్ హెచ్ఎండి 105 విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హెచ్ఎండి 105 పరికరాన్ని విడుదల చేస్తున్నట్లు హెచ్ఎండి ప్రకటించింది. అసాధారణమైన పనితీరు, సొగసైన డిజైన్, వర్ధిత్రమ ప్రముఖ ప్రమాణాలను మిళితం చేస్తూ, కంపెనీ యొక్క సంచలనాత్మక ఉత్పత్తుల వారసత్వంపై ఆధారపడి రూపొందించిన హెచ్ఎండి 105 ఒక ప్రధాన సాంకేతిక పురోగతిని సూచిస్తుంది. ఈ ఫోన్ అంతర్నిర్మిత యుపిఐ అప్లికేషన్తో వస్తుంది. ఇది హెచ్ఎండి ఫోన్ల విశ్వసనీయతను యుపిఐ సౌలభ్యం, యాక్సెసిబిలిటీతో మిళితం చేస్తుంది. వినియోగదారులు స్మార్ట్ఫోన్ లేకుండా కూడా యుపిఐ చెల్లింపు లావాదేవీలను సురక్షితంగా, సజావుగా నిర్వహించడానికి ఇది వీలు కల్పిస్తుంది.

'మూవ్ కూల్'ను ఆవిష్కరించిన మూవ్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: మూవ్ భారతదేశపు ప్రముఖ నొప్పి ఉపశమనం బ్రాండ్, 'మూవ్ కూల్'ను విడుదల చేసిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కోల్డ్ థెరపీతో ప్రేరేపించబడిన గొప్ప ఆవిష్కరణ ఇది. మెంథాల్ యొక్క కూలింగ్ పవర్ తో, ఈ కొత్త ఉత్పత్తి చురుకైన జీవనశైలి కారణంగా గాయాలు, బెణుకులు, కండరాల నొప్పి (స్ట్రెయిన్స్) కారణంగా కీళ్ల మరియు కండరాల నొప్పి నుండి ఉపశమనం అందించడానికి రూపొందించబడిందన్నారు. డిసెంబర్ 2021లో నిర్వహించిన కెట్టెల్ మెయిన్ ఇండియా డీసీజ్ డిమాండ్ సర్వే ప్రకారం, భారతదేశంలో 4000కి పైగా రెస్పాండెంట్స్ తో, సుమారు 8 శాతం రెస్పాండెంట్స్ తమ నొప్పి సంఘటనలు వ్యాయామం లేదా క్రీడలకు సంబంధించినవని చెప్పారు. మూవ్ కూల్ కండరాల నొప్పి, బెణుకులు, స్ట్రెయిన్స్ సహా శారీరక ధారుఢ్యానికి సంబంధించిన గాయాలను పరిష్కరిస్తుందన్నారు. ఇది ప్రభావానికి గురైన ప్రదేశాన్ని మొద్దుబారిచి కేవలం 15 సెకండ్లలో పని చేయడం ఆరంభిస్తుందన్నారు. ఈ విడుదల గురించి వ్యాఖ్యానిస్తూ, కనిక క్రా, రీజనల్ మార్కెటింగ్ డైరెక్టర్, హెల్త్ %c% న్యూట్రిషన్, రెకిట్ సౌత్ ఏషియా మాట్లాడుతూ "భారతదేశంలో అత్యంత నమ్మకమైన నొప్పి ఉపశమన కలిగించే బ్రాండ్ లో ఒకటిగా, మూవ్ భారతీయులు తమ నొప్పిని నిర్వహించడంలో దశాబ్దాలుగా సహాయపడుతోందన్నారు. మా ప్రేక్షకుల పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి మా ఉత్పత్తి ఆవిష్కరణను మరింత మెరుగుపరచడానికి ఉత్తమమైన పరిష్కారాలను అందించడానికి మా నిబద్ధతకు ఈవిడుదల ఒక నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

బతికి ఉన్న వారి పేర్లతో ఉన్న ప్రభుత్వ పథకాల పేర్లను మార్చాలి

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్లో గత ఐదు సంవత్సరాల కాలంలో జగనన్న లాంటి బ్రతికి ఉన్న వారి పేర్లతో ఉన్న పథకాల పేర్లను మార్చాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఆవసరమైతే అమరులైన మహనీయుల పేర్లను పెట్టాలని, నూతన మంత్రి వర్గ కూర్పు అన్ని ప్రాంతాల, కులాల, మతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మంచి టీం ను నారా చంద్ర బాబు నాయుడు ఎంపిక చేశారని తెలిపారు. వైకాపా పాలనలో ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందని, అరాచక పాలన, అభివృద్ధి నిరోధక పాలనను ఓటర్లు కసితో తిరస్కరించారన్నారు. గత ప్రభుత్వ అవి నీతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, తద్వారా భవిష్యత్తులో రాజకీయ, అధికార అవినీతికి ఆస్కారం లేకుండా చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓటర్లు సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలన్నారు. ప్రతీకార చర్యలుండరాదని, ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరగాలని కోరుకున్నారని వివరించారు. బూతుల మాట్లాడే నేతలను, అరాచక, అవినీతి శక్తులను ప్రజలు ఓడించారని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల, కక్ష సాధింపు చర్యలుండవని, తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. జనసేన నేత పవన్ కళ్యాణ్, నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని గమనించి స్థానిక నేతలు ప్రతీకార చర్యలకు, దాడులకు ఆస్కారం ఇవ్వరాదని లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు.

మంత్రివర్గంలో గుంటూరు జిల్లాలకు పెద్దపీట

నారా లోకేష్, నాదెండ్ల మనోహర్లకు కీలక మంత్రి శాఖలు కేటాయించే అవకాశం

విశాలాంధ్ర-గుంటూరు : అమరావతి రాజధాని ప్రాంతంలోని గుంటూరు జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలో పెద్దపీట వేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని అమరావతి నుండి పాలన సాగించ నుండగా మంగళగిరి నియోజకవర్గ నుండి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన లోకేష్కు, జనసేన పార్టీ తరపున తెనాలి నుండి విజయం సాధించిన నాదెండ్ల మనోహర్లకు మంత్రివర్గంలో స్థానం లభించింది. నాదెండ్ల మనోహర్కు రెవెన్యూ శాఖ, నారా లోకేష్ కు పంచాయితీరాజ్, ఐటీ శాఖలను కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. మరోవైపు ముఖ్యమంత్రి స్వంత తన వద్ద కీలక మంత్రి పదవులను ఉంచుకునే అవకాశం ఉంది. దీంతో మంత్రివర్గంలో రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాకు ప్రాధా న్యత కల్పించినట్లు తెలుస్తుంది. గత ఐదేళ్లుగా అభివృద్ధికి దూరమైన గుం టూరు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమా లను పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది.

దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

- కారుమంచి రామారావు కేంద్ర మంత్రి చిరాగ్కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : దేశంలో, ఇటు రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయని, ఈ సంఘటనలపై పార్లమెంట్లో చర్చించి కఠినమైన చట్టాలను తీసుకు రావాలని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ లాగా దళితుల సమస్యలపై అవగాహన కలిగి వాటి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని చిరాగ్ పాశ్వాన్ అన్నారు. చిరాగ్ పాశ్వాన్ మంగళగిరిలోని లోక్ జనశక్తి పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన కారుమంచి రామారావు వినతి పత్రాన్ని అందించారు.

చంద్రబాబు, పవన్ ప్రమాణ స్వీకారంతో దివిసీమలో సంబరాలు

విశాలాంధ్ర అవనిగడ్డ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేయడంతో దివిసీమలో కూటమి నాయకుల సంబరాలు అంబరాన్ని అంటాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాల్గోవ సారి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కొణిదల పవన్ కళ్యాణ్ అనే నేను అంటూ పవన్ కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేస్తున్న తరుణంలో దివిసీమ వ్యాప్తంగా బాణ సంచా, టపాసుల కూటమి నేతలు భారీగా పేల్చి మిఠాయిలు పంచారు. పవన్ కళ్యాణ్ 16 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో 10 సంవత్సరాలుగా పవన్ అభిమానులు నిరీక్షణ ఎన్నో ఒడిదుడుకులు, ఎంతో కష్టాలు తరువాత గురువారం ఉదయం పవన్ కళ్యాణ్ అనే నేను అంటూ పవన్ కళ్యాణ్ చేసిన ప్రమాణ స్వీకారంతో ఈ మాట కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల మాత్రమే కాకుండా పలు రాష్ట్రాల్లో, దేశాల్లో నిర్వహిస్తున్న తెలుగు ప్రజల అందరి కోరిక, కల, ఆశయం, ఆకాంక్ష నెరవేరింది. దీనితో దివిసీమ వ్యాప్తంగా జనసేన నేతలతో పాటు తెలుగుదేశం, బిజెపి నేతలతో కలిసి దివిసీమ వ్యాప్తంగా జరిపిన సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకొని దివిసీమ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద టివిలను ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించేలా ఆ యా కార్యాలయ అధికారులు ఉదయం 12 గంటల వరకు ప్రేక్షకులు టివిలను వీక్షిస్తూనే ఉన్నారు. 3 వ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోడీ పవన్ కళ్యాణ్ను ఒక వ్యక్తి కాదు, తుఫాన్ అంటూ సభాముఖంగా ప్రసంశించారు. పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం అయిన వెంటనే మెగా బ్రదర్స్ను అలింగనం చేసుకున్నారు.

మంత్రిగా లోకేష్ ప్రమాణ స్వీకారం : మంగళగిరిలో సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొంది నేడు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో నారా లోకేష్ ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్ఎస్ భవన్లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్కు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు చోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ప్రజలు తిలకించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గోవాద దుర్గారావు, గాజుల శ్రీనివాసరావు, గుంటి నాగరాజు, ఆకురాతి నాగేంద్ర, జొన్నాదుల బాలకృష్ణ, మున్నవ అశోక్, కొప్పుల మధుబాబు, వెలగపాటి విలియం, షేక్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ వద్ద బాణసంచా పేల్చి సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు 4వ సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని విశ్వ విద్యాలయంలోని టిఎన్ఎస్ఎఫ్, టిఎన్టియుసి సంఘాలు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ముందుగా డైక్మన్ ఆడిటోరియంలో చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించిన విద్యార్థి ఉద్యోగ సంఘ నాయకులు వర్సిటీ ముఖద్వారం వద్దకు వచ్చి భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆచార్య డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముందుచూపు గల నాయకుడిగా చంద్రబాబుకు గొప్ప పేరు ఉందని, దానిని నిజం చేస్తూ ప్రపంచం గర్వించేలా ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని నిర్మిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పన పండేవి పూర్తి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్ వెంకట రమణ, టీఎన్టీయుసి అధ్యక్షుడు వి.విష్ణు ప్రసాద్, ఎన్. వెంకటేశ్వర్లు, ఎన్.కోటేశ్వరరావు, ఎల్.రాంబాబు, ఎన్.కోటేశ్వర రావు, ఎన్.సాంబయ్య, ఆర్.ఆనంద్, కనకరాజు, ఎ.గోపి, కె.అశోక్, ఎన్.శ్రీనివాసరావు, ఎన్.నాగేశ్వరరావు, వి.వరప్రసాద్, ఎంవివిన్ ప్రభాకర్, ఎన్.విజయ్, టీపీ సురేంద్ర రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.